ప్రజాశక్తి
మంగళవారం 8 ఆగస్టు 2023 శ్రీ సత్యసాయి



పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించిన పేదలు

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ స్థలం(సర్వే నంబర్-668)లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ప్రజలతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం గత వారం స్పందనలో సబ్ కలెక్టర్‌కు సమర్పించిన అర్జీలకు రసీదులు ఇవ్వాలని కార్యాలయ ఎఒ రమణను కోరారు. అలాగే ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మరోమారు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, తిప్పన్న, నరసింహ, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల

నిరసనాగ్రహం..!

- కలెక్టరేట్ ముట్టడి
- జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- స్పందించకుంటే 17న చలో విజయవాడ
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు పోరుబాట పట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొని ప్రభుత్వంపై నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికుల ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ మద్దతు తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులందరినీ పర్మనెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా దాని గురించి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలన్నారు. క్యాజువల్ సెలవులు ఇవ్వాలన్నారు. కోవిడ్‌లో పనిచేసిన కార్మికులను ఆఫ్కాన్‌లో చేర్చి వారి కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత విధానంలో పింఛన్ ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించకుంటే ఈనెల 17 చలో విజయవాడ నిర్వహించి, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, నాయకులు నరసింహులు, పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబు, మున్సిపల్ నాయకులు మల్లికార్జున, నాగార్జున, రామయ్య, శివ, ఆది, గణేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ముందస్తు అరెస్టు

మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సోమవారం ఆమడగూరు నుంచి ధర్నాలో పాల్గొనడానికి బయలుదేరిన ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి సాయంత్రం వరకు అక్కడి పోలీస్ స్టేషన్‌లో అదుపులో ఉంచుకున్నారు. సాయంత్రం ఆయనను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమం ఆగదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు మున్సిపల్ కార్మికులు ఆందోళనలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు.





ధర్నాలో ప్రసంగిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్

క్లాస్ పీకాక కదలిక..!



- అధినాయకుడి మందలింపుతో ప్రాజెక్టుల వద్దకు తమ్ముళ్ల పరుగులు
- చివరి వరకు ఇదే తీరు కొనసాగేనా .?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల పరిశీలన సమయంలో జిల్లా ముఖ్య నేతలకు క్లాస్ పీకినట్టు సమాచారం. తమ హయాంలో చేపట్టిన పనులు కళ్లకు కనబడుతున్నా.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలో విఫలమవుతున్నారని అంక్షితలు పెట్టారు. ప్రాజెక్టుల యాత్ర ముగిసిన తరువాత చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించే సమయంలో జిల్లా ముఖ్య నేతలందరితోనూ సమావేశం అయ్యారు. ఈ సమయంలో అందరికీ క్లాస్ పీకినట్టు సమాచారం. ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నా క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయడం లేదని సుతిమెత్తగానే మందలించారు. దీంతో నేతలు ఒక్కసారిగా మేలుకుని ప్రాజెక్టుల చుట్టూ పరుగులు పడుతున్నారు. ఆదివారం రోజు ఉన్న ఫలంగా ముదిగుబ్బకు చేరుకుని జిల్లేడుబండ ప్రాజెక్టు సమస్యపై స్పందించారు. నిర్వాసితులకు పరిహారమివ్వకుండానే ప్రాజెక్టులు చేపట్టారని ఆందోళన బాటపట్టారు. వాస్తవానికి ఇదే నియోజకవర్గంలోని తాడిమర్రి మండలం పరిధిలో చిత్రావతి ముంపు నిర్వాసితుల పరిహారం విషయంలో అప్పట్లో పెద్దఎత్తున మరిమేకలపల్లి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికీ ఇంకా అనేక మందికి పరహారం అందాల్సి ఉంది కాని ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ ఆందోళనకు అప్పట్లో సిపిఎం మద్దతు ప్రకటించింది. కాని తెలుగుదేశం పార్టీ ప్రేక్షకపాత్రనే పోషించింది. ఇప్పటికీ ఆ సమస్యను పట్టించుకున్న దాఖలాల్లేవు. అయితే ఇప్పుడు అధినాయకుడి మందలింపుతో జిల్లేడుబండ ప్రాజెక్టుపై స్పందించారు. సోమవారం నాడు మడకశిర ప్రాజెక్టు పరిశీలించేందుకు వెళ్లారు. ఇలా వరుసగా కార్యక్రమాలు పెట్టుకోవడం నాలుగేళ్లలో ఇదే ప్రథమం కావడం గమనార్హం.

ఇదే పోరాటం కొనసాగేనా..!

వైసిపి నాలుగేళ్ల పాలనలో జిల్లాలోని ప్రధానమైన ప్రాజెక్టులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించి చేపట్టలేదు. కేవలం టెండర్లకే పరిమితమైంది. బిటిపి ఎత్తిపోతలకు ఇటీవలనే పరిహారం వరకు వచ్చింది. పనులు ముందుక సాగలేదు. ఇక పేరూరు ఎత్తిపోతలకు పరిహారం కూడా ఇవ్వలేదు. రూ.50 కోట్ల నిధులు అవసరం అవుతాయి. అవి విడుదల అవలేదు.. పనులూ ముందుకు సాగలేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నిర్వహణ అధ్వాన్నంగా మారింది. మూడేళ్లు తుంగభద్ర డ్యామ్‌లో పుష్కలంగా నీరున్నా పూర్తి స్థాయిలో నీరు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఆధునీకరణ పనులను రద్దు చేశారు. ఇవే కాకుండా గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు టిడిపి హయాంలో చేపట్టినవికూడా రద్దు చేసే పరిస్థితి నెలకొంది. వీటిపై ఆ పార్టీ నాయకులు ఇప్పటి వరకు స్పందించిన దాఖలాల్లేవు. ఇప్పుడు అధినాయకుడి పర్యటన, మందలింపు తరువాతనైనా ఆ పార్టీ నేతలు ఈ ప్రధానమైన సమస్యలపై స్పందిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

సకాలంలో అర్జీదారులకు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారులకు సకాలంలో పరిష్కారం చూపాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను 226 స్వీకరించారు. కలెక్టర్‌తోపాటు ప్రజల నుంచి 226 అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ సచివాలయ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అర్జీల స్వీకరణ అనంతరం డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో సంతృప్తి స్థాయి పెంచే విధంగా స్పందన జగనన్నకు చెబుదాం అర్జీలకు పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఎలాంటి పెండింగ్ ఉంచకుండా అర్జీలకు పరిష్కారం చూపించడం అత్యంత ముఖ్యమన్నారు. రీఓపెన్ కాకుండా అర్జీలను పరిష్కరించాని, అర్జీలు వచ్చిన వెంటనే పరిశీలించి సత్వర పరిష్కారం చూపించాలన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. చిలమత్తూరు ఎంపీడీవో, గోరంట్ల ఎంపీడీవో, బుక్కపట్నం ఎంపీడీవోలు స్పందించి బియాండ్‌లో ఎస్ఎల్ఎలో త్వరితగతిన పురోగతి సాధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, జిల్లా డిపిఒ విజయకుమార్, డిఎంఅండ్‌హెచ్ఒ ఎస్వీ కష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ .డా॥ఎంటి.నాయక్, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైకో పాలన పోతేనే ప్రజలకు న్యాయం

ఉమ్మడి అనంత జిల్లా టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్రంలో సైకో పాలన పోతేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె పార్థసారథి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా సోమవారం టిడిపి ఆధ్వర్యంలో గుడిబండ మండల పరిధిలోని కుగీరణ పాల్యం సమీపంలో హంద్రీనీవా పనులను పరిశీలించారు. అనంతరం గుడిబండలో అర్ధాంతరంగా ఆగిన జ్యోతిబా పూలే భవనాలను సందర్శించారు. టిడిపి హయాంలో ఇంతవరకూ పను లు పూర్తి చేస్తే వైసిపి ప్రభుత్వం పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం రొళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడు తూ టిడిపి హయాంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని, ఆ పథకాలను సైకో ప్రభుత్వం రద్దుచేసి ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తుందని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. చంద్రబాబు హయాంలో ఎన్నో ప్రాజెక్టులు చేపట్టగా జగన్ సర్కార్ వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వచ్చేది టిడిపి ప్రభుత్వ మేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రాజెక్టు పనులను, భవనాలను పూర్తిచేసి ప్రజలకు మేలైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జడ్పీ మాజీ ఛైర్మన్ పూల నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వరనాయుడు, కన్వీనర్లు దాసిరెడ్డి, కుమారస్వామి, గణేష్, లక్ష్మీనారాయణ, మనోహర్, భక్తర్‌సాబ్, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, తెలుగు రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కెఎన్ పల్లి, సురేష్, ఐటిడిపి తాలూకా అధ్యక్షుడు కాంతరాజు మాజీ, ఎంపీపీలు కష్ణమూర్తి, రామిరెడ్డి నియోజకవర్గంలోని టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట

టిడిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశామని జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పేస్వామి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని రాళ్లపల్లి రిజర్వాయర్ పనులను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ రిజర్వాయర్ ఏర్పాటు వల్ల చాలామంది రైతులకు ఉపయోగం ఉండడంతో టిడిపి పాలనలో రిజర్వాయర్లు నిర్మించడానికి సిద్ధం చేశామన్నారు. ఒక టిఎంసి నీటిని నిలుపుదల చేయడం వల్ల ఎందరో రైతులకు అనుకూలంగా ఉంటుందన్నారు. అంతేకాక బోరు బావుల కింద పంటలను పండించుకోవచ్చని తెలిపారు. టిడిపి అధికారం లోకి వచ్చిన వెంటనే అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచి శ్రీనాథ్, కన్వీనర్లు మనోహర్, భక్తర్‌సాబ్, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, నారాయణప్ప, చిత్రశేఖర్, బూదిపల్లి జయరాం, దుర్గేష్, గోవిందప్ప, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రత్నగిరి కొల్లాపురి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

రత్నగిరి కొల్లాపురి రిజర్వాయర్ పరిశీలన

రొళ్ల : సాగునీటి ప్రాజెక్టులపై వైసిపి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని టిడిపి మాజీ మంత్రులు, ముఖ్య నాయకులు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం మాజీ ఎమ్మెల్సీ గుండు మాల తిప్పేస్వామి సారథ్యంలో రత్నగిరి కొల్లాపురి రిజర్వాయర్‌ను పరిశీలించారు. అంతకుమందు రొళ్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ రాష్ట్రానికీ లేని సాగునీటి వనరుల లభ్యత ఎపికి ఉందని, వీటిని సక్రమంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సాగునీరు అందించవచ్చు అన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాడెల్టాకు తెచ్చి డెల్టాకు రావాల్సిన నీటిని పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమకు నీరు ఇచ్చామన్నారు. పట్టిసీమ ద్వారా 120 టిఎంసిల నీటిని పొదుపు చేయవచ్చు అన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ కోసం 2014 నుంచి 2019 వరకూ రూ. 68,293 కోట్లు ఖర్చు చేయగా, వైసిపి ప్రభుత్వం కేవలం రూ. 22,165 కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత టిడిపిదే అన్నారు. ఈ నాలుగేళ్లలో అవినీతి తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. అవినీతి, అక్రమాలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించటం, జైళ్లకు పంపడం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిశీలకులు పార్థసారథిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబికా సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఎన్.దాసిరెడ్డి, అగలి జడ్పిటిసి ఉమేష్, మండల ప్రధాన కార్యదర్శి ఈరన్న, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రొళ్లలో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించిన నాయకులు

సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ జట్లు ఎన్నిక

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా సబ్ జూనియర్స్ అండర్-14 బాల, బాలికల జట్ల ఎంపిక రెండు రోజుల పాటు జరిగింది. హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంజిఎం క్రీడామైదానంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 15 ఫుట్‌బాల్ క్లబ్‌ల నుంచి 80 మంది బాలురు, 40 మంది బాలికలు పాల్గొనగా వీరిలో ప్రతిభ కనబరిచిన 25 మంది చొప్పున బాల, బాలికల జట్లకు ప్రాబబుల్స్ గా ఎంపిక చేశారు. వీరికి త్వరలో క్యాంపు నిర్వహించి, తుది జట్టును ప్రకటిస్తామన్నారు. తుదిజట్టు కడపలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు జేవీ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి మహమ్మద్ సలీం, కోశాధికారి శేఖర్, ఉపాధ్యక్షులు ఇర్షాద్ అలీ, సహాయ కార్యదర్శి కార్తీక్, ఈసీ మెంబర్ విజయవాణి, వివిధ క్లబ్ కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



ఎన్నికైన సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ జట్ల క్రీడాకారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

గోరంట్ల : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు "పంపిణీకి నోచని పాఠ్యపుస్తకాలు" శీర్షికతో ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో అధికారు లు స్పందించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్న పాఠ్యపుస్తకాలను విద్యాధికారులు ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ విషయంపై వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నూతనం గా చేరిన విద్యార్థుల కోసం ఈ పాఠ్య పుస్తకాలను నిల్వ చేశామన్నారు. పంపిణీ చేయడంలో కాస్త ఆలస్యమైందని, ఇప్పుడు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-రొద్దం

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే సిఎం జగన్ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో సోమవారం నిర్వశించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారినికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంపిపి చంద్రశేఖర్, వైస్ ఎంపిపి, ఆమె భర్త అంజనరెడ్డి, సర్పంచి రూప, బి.నారాయణరెడ్డి, మారుతీరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

'చేనేత'ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

చేనేత రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాజగోపాల్ ఆధ్వర్యంలో కార్మికులు తహశీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభా చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్రం విధించిన జిఎస్‌టి వల్ల, చీరలకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యం లేక కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిఎస్‌టి పేరుతో రూ. 3 వేల కోట్లు కార్మికుల నుంచి వసూలు చేసి, బడ్జెట్‌లో నేతన్న నేస్తంకి రూ. 200 కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించిందన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించి చేనేత రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.చాంద్ బాషా, అధ్యక్షులు చంద్రశేఖర్, కమిటీ సభ్యులు గంగరాజు, మాబు, రామాంజనేయులు, కార్మికులు ఓబులేసు, శివారెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.



తహశీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు

ఘనంగా ప్రపంచ చేనేత దినోత్సవం

ప్రపంచ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా జాతీయ చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షులు షీలా నారాయణస్వామి ఆధ్వర్యంలో స్థానిక హిందూపూరం ప్రధాన రహదారిలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో చేనేత వ్యవస్థ నానాటికీ అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక మండల నాయకులు కొత్తపల్లి బెస్త కిష్టప్ప, కుమ్మర కిష్టప్ప, సంజీవ, మనతూరు ఈశ్వర్, దాసరి సుధాకర్, , కొండ జనార్ధన, బాలాజీనగర్ శ్రీనివాసులు, శ్రీరాములు, సిరిమాల వెంకటేశులు, పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలోని చోళసముద్రం జడ్పి హైస్కూల్‌లో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను గ్రామంలోని మగ్గం వద్దకు తీసుకెళ్లి పట్టు చీరలు తయారు చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

గోరంట్ల : మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల రికార్డులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. అలాగే కూలీల అభిప్రాయాలు సేకరించింది. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకు రూ. 7.48 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులతో పంచాయతీరాజ్ తాగునీరు, ఎన్ఆర్ఇజిఎస్ కింద ఉపాధి కూలీలకు పనులు చేపట్టారు. కానీ ఈ తనిఖీలో కేవలం రూ. 23,500 మాత్రమే రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం బిల్లులు కూలీలకు చేరినట్లు తనిఖీ బృందం అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి ఎపిడి శంకర్, ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా, ఎస్ఐ బాబు, ఎపిఒ వరప్రసాద్, జెఇ మోహన్‌బాబు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

చేనేత చట్టాన్ని అమలు చేయాలి



చేనేత విగ్రహం వద్ద పోలా రామాంజినేయులు, తదితరులు





చేనేత విగ్రహం వద్ద వేర్వేరు సందర్భాల్లో వైసిపి, టిడిపి నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చేనేత 11 రకాల చట్టాన్ని పక్కాగా అమలుచేయాలని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం గాంధీగనర్లో ఉన్న గాంధీవిగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత చట్టాన్ని అమలు చేయాల్సిన డెవలప్మెంట్ కమిషనర్, హ్యాండ్లూమ్స్ పవర్ లూమ్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల తీరువల్ల చేనేత పరిశ్రమ తీవ్రసంక్షోభంలోకి కూరుకుపోయి చివరికి కార్మికులు ఉపాధి లేక అప్పులు చేసి వాటిని తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. కార్మికులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు అన్నం సూరి, వెంకటస్వామి, ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, దశరథ, శ్రీరాములు, వేణు, నాగేంద్ర, లోకేశ్, సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, అయూబ్, బాషా, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం : చేనేతల అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్ బేగం, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ తెలిపారు. పట్టణంలో చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వచ్చి కదిరిగేటు వద్దనున్న చేనేత విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేనేతల సమస్యలను గుర్తించి ముడిపట్టుకు రాయితీ ఇప్పించాలని రూ.600లు ప్రభుత్వం నుంచి ఇప్పించారన్నారు. వాటిని గత ప్రభుత్వం చేనేతలకు సరిగ్గా ఇవ్వలేదన్నారు. మరోసారి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి చేనేతల సమస్యలను తీసుకెళ్లడంతో ముఖ్యమంత్రి చేనేతల కోసం నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టి రూ. 600లు ఇచ్చే ముడిపట్టు రాయితీని ఏకంగా ఏడాదికి రూ.24వేలు చొప్పున ఒకే సారి నేతన్నల ఖాతాల్లో పడేలా చేశారన్నారు. ఎమ్మెల్యే చొరవతో అర్హులైన ప్రతి చేనేత. కార్మికుడికి రూ.24వేలు నేతన్న నేస్తం పథకం వర్తింపచేయడంతో చేనేత కార్మికులు వాటితో మగ్గాలను అభివృద్ధి చేసుకుంటూ మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాచర్ల అంజి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ ధర్మవరంలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిందన్నారు. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం వల్ల చేనేత పరిశ్రమ కుదేలయిందన్నారు. నేసిన చీరకు గిట్టుబాటు లేక చేసిన అప్పులు తీర్చలేక చివరికి ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిష్ రాజు, సుదర్శన్ రెడ్డి, నారాయణస్వామి,తుంపర్తి పరమేశ్, బోడగలగిరిధర్, గోపాలక్రిష్ణ, దుస్సాక్రిష్ణ, నబీరసూల్, పొరాళ్లరహీం,నిరంజనాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ప్రపంచచేనేత దినోత్సవాన్ని పురష్కరించుకుని నేతన్న విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం పీఆర్టీ వీధిలోని సీనియర్ చేనేత కార్మికులైన వేల్పుల భాస్కర్, బాగ్యలక్ష్మీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు కాచర్లకంచన్న, పురుషోత్తం చింతపులుసు పెద్దన్న, పరిశేసుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలోప్రపంచ చేనేత దినోత్సవాన్ని సోమ వారం నిర్వహించారు. స్థానిక కదిరిగేటు వద్దఏర్పాటు చేసిన నేతన్న విగ్రహానికి చేనేత సంఘాల నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకాచలపతి, ఏపీ చేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ తదతరులు పాల్గొన్నారు. విశ్వదీపా సేవాసంఘం ఆధ్వర్యంలో నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో విశ్వదీపాసేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షులు గాజుల సురేశ్, కార్యదర్శి టీసీ శేఖర్‌రెడ్డి, సభ్యులు దాసరిబాబు, కేశవరెడ్డి, మాధవ, ప్రభాకర్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయండి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని ఇనుగులూరు గ్రామ పొలంలోని సుందరయ్య కాలనీ వాసులకు పక్కా పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు రమణ, కుళ్లాయప్ప, శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ రామ్‌నాథ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇనుగులూరు గ్రామ పొలం సర్వేనెంబర్ 380-2లో ఇల్లు లేని నిరుపేదలు సుందరయ్య కాలనీగా ఏర్పాటు చేసుకుని స్థలాలను చదును చేసుకుని అందులో నివాసముంటున్నారన్నారు. అధికారులు స్పందించి అనుభవంలో ఉన్నవారికి పట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంతమ్మ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

కదిరి టౌన్ : కదిరి పట్టణం అడపాలవీధికి చెందిన పలువురు యువకులు వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీ లో చేరారు. ఈ మేరకు సోమవారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ వారికి పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాగేంద్ర, కొమ్మినేని గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించిన కేంద్ర బృందం

గాండ్లపెంట : మండల పరిధిలోని కురుమామిడి, మల్ల మీద పల్లి, సచివాలయ పరిధిలోనిప్రభుత్వ పాఠశాలలు. అంగన్వాడి సెంటర్లు. సచివాలయాలు వ్యక్తిగత గృహాల్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లనిర్మాణాలను కేంద్ర బృంద సభ్యులు వెంకటేష్, కె. వెంకటేష్ సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, ఓబులమ్మ, భవాని, మదన్ మోహన్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సిహెచ్. ఇలియాజ్. వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వెంగళమ్మ చెరువులో 'మహాశక్తి'

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు, వీరజిన్నెపల్లి గ్రామాల్లో సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మినీ మేనిఫెస్టో, భవిష్యత్తుకు గ్యారెంటీచ మహాశక్తి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రూపొందించిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీ రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి,గంగిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి దేవానంద్ రెడ్డి, బూత్ కన్వీనర్ మహేష్, జయరాం, మహిళా నాయకురాలు మాధవి, రాధమ్మ, చిన్నకృష్ణమ్మ, మస్తానమ్మతో పాటు నాయకులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి పట్టణం 24వ వార్డుకు చెందిన రవి కుమారుడు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కందికుంట వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక నాయకులు రొద్దం బషీర్ చేతుల మీదుగా బాధితుని కుటుంబ సభ్యులకు రూ. 25వేలు అందజేశారు.

చలో కలెక్టరేట్‌కు తరలిన కార్మికులు

కదిరి టౌన్ : మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికై తలపెట్టిన చలో కలెక్టరేట్ ముట్టడికి కదిరి మున్సిపల్ అసోసియేషన్ నాయకులు, కార్మికులు తరలివెళ్లారు. కదిరి మునిసిపల్ యూనియన్ నాయకులు జనార్ధన్, తిరుపాల్, బాలకృష్ణ, సూరి, నరసింహ మూర్తి, ఎస్. రాజు, చెన్నకృష్ణ, రాజేష్, చంద్రప్ప, ఎస్. నరసింహ, గంగాద్రి, రామాంజులు, రమణ తదితరులు తరలివెళ్లారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దళిత రక్షణ యాత్రను చేపడుతున్నట్లు కుల వివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప అన్నారు. దళిత రక్షణ యాత్రలో భాగంగా సోమవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య అధ్యక్షతన చర్చావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ. నల్లప్ప మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా అనేక రూపాల్లో కుల వివక్ష జరుగుతోందని అన్నారు. ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చినా అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక పోరాటాలు చేసి ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమిని ఇవ్వాలని, ప్రతి గ్రామంలో పౌర హక్కుల దినం పాటించాలని కోరుతున్నప్పటికీ ఇప్పటి అమలు చేయలేదన్నారు. నేటికి చాలా గ్రామాల్లో దళితులకు ఆలయ ప్రవేశం లేదన్నారు. అవమానాలను భరించలేక ఎంతో మంది దళితులు క్రిష్టయన్లుగా మారుతున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక కొంత మంది రాజకీయ నాయకులు దీనిని సైతం రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన అసైన్మెంట్ చట్టాన్ని ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. దళిత రక్షణ యాత్రలో భాగంగా చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పై చర్చించి త్వరలో యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతామన్నారు. ఈ యాత్రకు అధికారులు, దళితులు, దళిత సంఘాల నాయకులు మద్దతు పలికి, మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి. రమణ, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, జ్యోతమ్మ, నారాయణ, కిరణ్ కుమార్, మండల కార్యదర్శి మధు, మండల అధ్యక్షులు తిమ్మయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల హామీల అమల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్నికల ముందు వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. విఆర్‌ఎల సమస్యల పరిష్కారానికై దశల వారీ ఆందోళనలలో భాగంగా సత్య సాయి జిల్లా ఆర్డీవో కార్యాలయం వద్ద రెండు రోజుల దీక్షను సోమవారం ప్రారంభించారు. ఈసంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా విఆర్‌ఎ సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు ప్రభుత్వ పెద్దలకు విన్నవించినా ఫలితం కన్పించలేదని అన్నారు. విఆర్‌ఎకు పే స్కేలు అమలుచేయాలన్నారు. నామీనులుగా పనిచేస్తున్న వారందరిని విఆర్‌ఎలుగా నియమించాలని, అర్హులకు అటెండర్, వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక విఆర్‌ఎలకు ఒక్క రూపాయి పెంచకపోగా ఉన్న డిఎలో కూడా కోత విధించిందన్నారు. డిఎరికవరీ ఆపాలని ఎన్ని సార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఏ మాత్రం కనికరించలేదన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మరోదశ పోరాటానికి సిద్ధమయ్యామన్నారు. రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న దీక్షలకు ప్రభుత్వం స్పందించకుంటే ఆగష్టు 23, 24 తేదీలలో విజయవాడలో రాష్ట్ర స్థాయి దీక్షలు చేపడుతామని, ఆగష్టు 25న జగనన్నకు నేరుగా చెబుదాం అనే కార్యక్రమంలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి ప్రసాద్, నాయకులు పెద్దన్న, నరసింహులు, నరసప్ప, పద్మావతి, లక్ష్మీదేవి, సంధ్య నారాయణమ్మ జిల్లాల నలుమూలల నుండి వచ్చిన విఆర్‌ఎల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్షల్లో మాట్లాడుతున్న ఇఎస్ వెంకటేష్

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. సోమవారం పట్టణంలో సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కవులు, రచయితలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప, పట్టు రైతు సంఘం నాయకులు ధనాపురం వెంకట్రామి రెడ్డి, సిద్దా రెడ్డి, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్టు ఉదయ్ కుమార్, జెవివి డాక్టర్ ఇటి రాంమ్మూర్తి మాట్లాడుతు బడుగు, బలహీన వర్గాల కోసం గద్దర్ పోరాడారని తన ఆట పాటలతో అందరినీ కదిలించారని అన్నారు. తన గళంతో కోట్లాది మందిని చైతన్యపరిచిన గద్దర్ మృతి తీరని లోటని అన్నారు.ఉద్యమ పాటల ద్వారా ఆయన ప్రజలకు ఇంకా త్వరగా చేరువయ్యారని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, సిఐటియు పట్టణ నాయకులు విఆర్ రాము, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, కార్యదర్శి రమణ, సహాయ కార్యదర్శి మధు, జోతమ్మ, కొటికి తిమ్మయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో చైతన్య గంగిరెడ్డి, నాగేంద్ర కుమార్, ఆనంద్, బోయ వెంకటేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్ననాయకులు

ప్రతి శనివారం చేనేత వస్త్రాలను ధరించండి

ప్రజాశక్తి బత్తలపల్లి

చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి శనివారం ఉద్యోగస్తులు చేనేత వస్త్రాలను ధరించాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండలస్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు అధికారులందరూ ప్రతి శనివారం చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌజన్యకుమారి, ఏపీవో ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్ రాజు, ఇంజనీర్ రమణయ్య. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఈ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

బత్తలపల్లి : మండలంలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన సావిత్రమ్మ రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్నారు. అందుకు ఆమెకు అయిన ఖర్చును సీఎం సహాయనిధి కింద ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు స్పందించిన ఆయన సీఎం కార్యాలయం నుంచి రూ.3.50 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆమె కుమారుడికి ధర్మవరం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో సోమవారం అందజేశారు.

రౌడీషీటర్ నుంచి కాపాడాలని వినతి

పుట్టపర్తి రూరల్ : తమకు రౌడీ షీటర్ బారి నుండి రక్షణ కల్పించాలని కదిరి పట్టణంలో 34 వార్డులో నివాసం ఉంటున్న కాయల వెంకటరమణ, నారాయణమ్మ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న ధనుంజయ రెడ్డి అనే కర్ణాటక కు చెందిన రౌడీషీటర్ తమపైచ తమ కుమారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడమే కాకుండా తమ కుమారుడిని చంపుతానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ముందు కన్నీరు మున్నీరయ్యారు. అదేవిధంగా ధర్మరానికి చెందిన గీతాంజలి అనే మహిళ తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. తన భర్త వరుణ్ తేజ్‌ను ధర్మవరానికి చెందిన లక్కీ డాబా నిర్వాహకులు తీవ్రంగా కొట్టడంతో మృతిచెందాడని అయితే నిందితులపై చర్యలు తీసుకోకుండా సాధారణ మరణంగా ధ్రువీకరించి కేసు నమోదు చేయలేదని తన భర్తను చంపిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసింది. తన భర్త గతంలో లక్కీ దాబాకు చెందిన వ్యక్తులతో ఫోన్ సంభాషణలు కూడా తమ వద్ద ఉన్నాయని నా భర్త చావుకు వారే కారణమని ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ధర్మవరం డీఎస్పీకి సిఫార్సు చేశారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జిదారుల నుండి 63 పిటీషన్లను ఎస్పీ స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ముందే సంబంధిత స్టేషన్ అధికారి కి ఫోన్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, లీగల్ అడ్వైజర్ సాయి నాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబును హిందూపురం జర్నలిస్టులు కోరారు. సోమవారం పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబును కలిసి, సమస్యను వివరించి ఈ విషయంపై వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ రిపోర్టర్లు రాంప్రసాద్, శ్రీనివాసులు, ప్రకాష్, సుధాకర్, క్రిష్టప్ప, షబ్బీర్ మాట్లాడుతు తమకు ఇళ్ల పట్టాల మంజూరులో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. గతంలో శ్రీకంఠపురం పొలంలోని 484 సర్వే నెంబర్ లో అప్పటి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల మంజూరుకు ఏకంగా ప్రత్యేక జీవో సైతం జారీ చేసిందన్నారు. భూ వివాదం కారణంగా 484 సర్వేనెంబర్ లో ఇప్పటిదాకా జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయలేదన్నారు. కొట్నూరు పొలంలో సర్వే నెంబర్ 21-3, 21-4, 21-5లో 7.76 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, జర్నలిస్టులు గుర్తించి, అందులో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అటు ప్రభుత్వానికి ఇటు రెవెన్యూ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా ఇప్పటిదాకా ఇళ్ల పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎదీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఈ విషయంపై రెవెన్యూ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సురేష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు జాకబ్, లక్ష్మి రెడ్డి, శ్రీకాంత్, రంగనాథ్, రాజగోపాల్, చరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

బుక్కపట్నం : మండల పరిధిలోని అగ్రహారం క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. పుట్టపర్తి రూరల్ సిఐరామయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని అగ్రహారం క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పాముదుర్తి వైపు వెళ్తున్న రెండు ఆటోలు తనిఖీ చేయగా రెండు ఆటోల్లో ఉన్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించామన్నారు. బియ్యం తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని విచారించగా సమీప గ్రామాలలో ప్రజల వద్ద కొనుగోలు చేసి నల్లమాడ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రంగారెడ్డి అనే వ్యక్తికి విక్రయించడానికి తీసుకెళుతున్నట్లు చెప్పారన్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న కేశవ, దుర్గప్పలను అదుపులోకి తీసుకొని ఆటోలను, రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు వివరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ గ్రామ పంచాయతీ బలిజపల్లి గ్రామానికి చెందిన కొడికొండ స్టోర్ డీలర్ విష్ణువర్ధన్ రెడ్డి (40) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. తన పొలానికి నీరు వదిలేందుకు వెళ్లిన ఆయనకు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

లేపాక్షి : ద్వి చక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని మామిడిమాకులపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(60) స్వ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై హిందుపురం వెళ్తుండగా స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వెనుక వైపు నుంచి రెండు కార్లు ఢీ కొనడం తో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని హుటాహుటిన అంబులెన్సులో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వాహనాలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో గతంలోనూ పలు ప్రమాదాలు జరిగాయని, ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

లేపాక్షి : స్థానిక ఓ కళాశాల వద్ద సోమవారం ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అమడగూరు మండల పరిధిలోని ఆకువారంపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణకు చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగిందని, అయితే ఆమె కాపురానికి రాలేదని సమాచారం. ఈ క్రమంలో అతడు సోమవారం ఆ యువతి చదువుతున్న కళాశాల వద్దకు వెళ్లి మాట్లాడాడు. అయినా ఆమె కాపురానికి వచ్చేందుకు నిరాకరించడంతో వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. అప్రమత్తమైన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఏదేమైనా కళాశాలలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నం చేయడంతో తోటి విద్యార్థుల భయందోళనలకు గురయ్యారు. కాగా స్టూడెంట్ యూనియన్ నాయకులు కళాశాలను సందర్శించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రిన్సిపల్‌ని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీకి చెందిన వ్యక్తి అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీకి చెందిన కృష్ణమూర్తి(38) అనారోగ్యంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి రోడ్డు ప్రమాదంలో కన్ను పోగొట్టుకున్నాడు. దీంతో కూలి పనిచేస్తూ జీవించేవాడు. కిడ్నీలు పాడవ్వడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన కృష్ణమూర్తి మనస్థాపానికి గురై తన ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వాలంటీర్ మృతి

మడకశిర : పట్టణంలోని ఆరేపేట సచివాలయంలో వాలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మంజునాథ్ గుండెపోటుతో కుప్పకూలి పడిపోయాడు. దీంతో తోటి ఉద్యోగులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించాడు. అతడికి రెండు నెలల క్రితం వివాహమైంది. అతడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

వికలాంగుడికి ఆర్థికసాయం

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో గత నెలలో విద్యుత్ షాక్ కు గురైన మూగ, చెవుడు అయిన వికలాంగుడికి పలు స్వచ్ఛంద సంస్థలు ఆర్థికసాయం అందించాయి. ఈ మేరకు హిందూపురం డేఫ్ సభ్యులు రూ. 2800, రిజ్వాన్ అసోసియేషన్ రూ, 28వేలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాయి. అలాగే వారి దీనస్థితిని చూసి తక్షణ సహాయం కింద 35 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు, ఒక త్రి చక్ర వాహనం సహాయం అందించారు. ఇదే విషయంపై ప్రతి సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కి అర్జీ ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా సాయం

నల్లచెరువు : మండల పరిధిలోని పంతులు చెరువు గ్రామంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అంజనప్ప మేనెలలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. దీంతో మృతుని భార్య వెంకటరమణమ్మకు ఎంపీడీవో శకుంతల,ఎంపీపీ రమణారెడ్డి, చేతుల మీదుగా 5,లక్షల రూపాయల విలువైన చెక్కును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మంజుల, టెక్నికల్ అసిస్టెంట్లుచ ఉపాధి హామీ సిబ్బంది, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, లక్ష్మీపతి యాదవ్, సర్పంచి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

బత్తలపల్లి : మండలంలోని ముద్దనపల్లి గ్రామానికి చెందిన దేవేంద్ర ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఖర్చులు అధికమైనాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భార్య కేతిరెడ్డి సుప్రియకు విన్నవించుకున్నాడు. దీంతో స్పందించిన ఆమె సోమవారం ధర్మవరంలోని తన స్వగృహంలో బాధితుడికి రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు.

దౌర్జన్యంగా పంట తొలగింపు

లబోదిబోమంటున్న బాధిత రైతు

తలుపుల : వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసుకున్న వేరుశనగ పంటను దౌర్జన్యంగా ఆ భూమి తనదంటూ ఓ వ్యక్తి ట్రాక్టర్ తో దున్నేసి పంటను నాశనం చేశారని బాధిత రైతు వీరాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పులిగిండ్లపల్లి పంచాయతీ రజనోల్లపల్లికి చెందిన రైతు వీరాంజనేయులుకు సర్వేనెంబర్ 402-2 నందు 3.49 ఎకరాల భూమిని ప్రభుత్వం తమ వంశీకులకు భూ పంపిణీ చేసింది.ప్రస్తుతం ఆభూమిని అగ్రంపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న రామన్న అక్రమంగా అన్ ఆన్‌లైన్ చేయించుకున్నారని బాధిత రైతు వీరాంజనేయులు వాపోయారు. దీనిపై కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆ భూమి తనకే దక్కే విధంగా తీర్పు ఇచ్చిందన్నారు. దీంతో 50 వేల రూపాయలు ఖర్చు చేసి ఆ భూమిలో వేరుశెనగ పంటను సాగు చేశానన్నారు. మొలక దశలో ఉన్న పంటను అగ్రహారం పల్లి గ్రామానికి చెందిన చిన్న రామన్న తన అనుచరులతో దౌర్జన్యంగా ట్రాక్టర్ తీసుకొని వచ్చి వేరుశనగ పంటను దున్నేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దౌర్జన్యంగా పంటను దున్నేసిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నారు.



తొలగించిన పంటను చూపుతున్న బాధిత రైతు

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్

అగళి : మండల పరిధిలోని అగళి, పి.బ్యాడిగెర గ్రామపంచాయతీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైనట్లు ఎంపిడిఒ నరేంద్ర సోమవారం తెలిపారు. అగళి పంచాయతీలో 2వ వార్డు, పి.బ్యాడిగెర పంచాయతీలో 2వ వార్డు ఖాళీ పడడంతో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూట్నీ, 12న ఆర్‌డిఒకు అప్పీల్, 14న ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. 19న పోలింగ్, అదేరోజు ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆయన తెలిపారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

లేపాక్షి : మండల పరిధిలోని కోడిపల్లి పంచాయతీలో 2వ వార్డు, పులమితి పంచాయతీ పరిధిలోని 10వ వార్డుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి శివన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తారని ఆయన తెలిపారు.

'గడప గడపకూ' వాయిదా

అగళి : మండల పరిధిలోని రావుడి, కదిరేపల్లి పంచాయతీల్లో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించాల్సిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఎంపిడిఒ నరేంద్ర తెలిపారు. తదుపరి తేదీని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే తెలియజేస్తామని ఆయన తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

సోమందేపల్లి : మండల పరిధిలోని బ్రహ్మసముద్రం గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ పోతులప్ప దేవస్థానా నికి పెనుకొండ నియోజకవర్గం టిడిపి నాయకులు కురుబ కృష్ణమూర్తి సోమవారం రూ. 10,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని, హాజరుకావాలని ఆహ్వానించారు.

నగదు రహిత చెల్లింపులు జరపాలి

సోమందేపల్లి : మండల పరిధిలోని చల్లపల్లి గ్రామ సచివాలయంలో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు నగదు రహిత చెల్లింపులు జరపాలని పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో ప్రజలకు అందించే సర్టిఫికెట్లు, తదితర సేవలకు ఈ నెల 15వ తేదీ నుంచి ఫోన్ పే, గూగుల్ పే, ఆధార్ ఆధారిత నగదు రుసుము చెల్లింపులు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

లేపాక్షి : మండల పరిధిలోని కోడిపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపికావేణు స్ఫూర్తితో కోడిపల్లి కాలనీలో డ్రైనేజీ కాలు వల నిర్మాణం పనులను చేపట్టామని సర్పంచి మంజునాథ్ తెలిపారు. అలాగే పంచాయతీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం కారెడ్డి పల్లితండాలోని మారెమ్మ ఆలయ అభివృద్ధికి సిఐసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి విరాళం అందజేశారు. ఈ మేరకు పూల శ్రీనివాసరెడ్డి 15వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

పుట్టపర్తి రూరల్: గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలం విద్యాధికారి బొల్లె ప్రసాద్ సారథ్యంలో వెంగళమ్మ చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రీన్ రెవల్యూషన్ ఆఫ్ స్టూడెంట్స్ అనే సెమినార్ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం అల్లిపీరా, ఉపాధ్యాయులు గోవిందు, రామకృష్ణ, గ్రీన్ భారత్ ఉమెన్ వెల్ఫేర్ డైరెక్టర్ సుగుణ, సహాయక కార్యదర్శి రమణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్యం

కదిరి టౌన్ : కదిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో గల సిమ్స్ హాస్పిటల్‌లో 60 సంవత్సారాలు పైబడిన వృద్ధులకు ఉచితంగా చికిత్స అందజేస్తున్నట్లు డాక్టర్ నిసార్ యాసిన్ తెలిపారు. సిమ్స్ హాస్పిటల్ అధినేత నిసార్ యాసిన్ మాట్లాడుతూ పేద ప్రజలకు సేవా చేయాలన్న సంకల్పంతో హాస్పిటల్ నెలకొల్పామని చెప్పారు తమ హాస్పిటల్ ద్వారా ఇప్పటికే అనేక వైద్య సేవలు అందజేస్తున్నామని వయోవృద్ధులకు సేవ చేయడం కోసం 60 సంవత్సరాల పైబడిన వారికి జనరల్ మెడిసిన్ ఉచిత వైద్యం అందజేస్తామన్నారు. ఈ ఉచిత వైద్య కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఓబుల దేవర చెరువు : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని కొండకమర్లలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులతో పాటు జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచులు గోవిందు, నిస్సార్ అహమ్మద్, రామ సుబ్బారెడ్డి , బోయపాటి జగన్మోహన్ చౌదరి, ప్రజాప్రతినిధులు గామస్తులు ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు పై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని ఎనుములపల్లి ఆరోగ్య కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంపై డిఎం అండ్ హెచ్ఒ ఎస్వీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ ఓబులపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు గురించి వివరించారు. ఎవరైనా సకాలంలో వేయించుకోని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఆగష్టు నెల 7 వ తేదీ నుండి 12 వరకు, సెప్టెంబర్ 11 నుండి 16 వరకు, అక్టోబర్ నెలలో 9 నుండి 14 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర సాయి, సూపర్ వైజర్ గోపీ, ఆరోగ్య కార్యకర్తలు అజీజ్ ఖాన్, పరిమళ, సుహాసిని, వీరచిన్నమ్మ, అమృత, ఆశా కార్యకర్తలు ముత్యాలమ్మ, శంకరమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈనెల 7 నుండి 12 వరకు 0 నుండి 5 సంవత్సరముల పిల్లలకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్ర, హెల్త్ సెక్రటరీలు, విలేజ్ క్లినిక్ సిహెచ్ఒలు, సూపర్వైజర్లు, మేల్ అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బత్తలపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధృఢత్వానికి, పోటీతత్వానికి ఉపయోగపడతాయనిఆర్డీటి స్పోర్ట్స్ సెక్టార్ డైరెక్టర్ సాయికృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో బాలికల గ్రామీణ అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్డీటి స్పోర్ట్స్ సెక్టార్ డైరెక్టర్ సాయికృష్ణ, ఆసుపత్రి మెడికల్ సూపరిండెంట్ జ్యోతి, రీజనల్ డైరెక్టర్ ప్రమీల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. అనంతపురంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి వారికి మంచి శిక్షణ ఇస్తామన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు దూసుకువెలుతున్నారన్నారు. ఏదైనా ధైర్యంతోనే సాధ్యమవుతుందన్నారు. బాలికలు బాలురతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. ఆర్డీటీ మైదానాల్లో ఎంతో మంది క్రీడాకారులుగా ఎదిగారన్నారు. అనూప జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపిక అయిందంటే అందుకు కారణం ఆర్డీటీనే అని అన్నారు. ఇలాంటి అవకాశాలు బాలికలకు రావడం గొప్ప వరమన్నారు. ఆర్డీటీ విద్య, క్రీడలకు ఎంతో ఖర్చు. చేస్తోందన్నారు. ఈ ఆథ్లెటిక్స్ మీట్‌లో బత్తలపల్లి ఏరియా నుంచి ఆరు జట్లు, ముదిగుబ్బ ఏరియా నుంచి నాలుగు జట్లు పాల్గొన్నాయి.ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారు ఆగస్టు 28న తేదీన అనంతపురంలో జరుగు జిల్లా సాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానంలో వచ్చిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఎటిఎల్ రుక్మాంగద, సంజీవరెడ్డి, సిఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేతల ఆర్థిక అభివృద్ధి కి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

చేనేతల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లో చేనేత జౌళి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ తో పాటు జెసి టి ఎస్ చేతన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మగ్గాలనే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న నేతన్నలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి 24 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆప్కో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. అంతకుమునుపు చేనేతలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి అధికారి రఘునాధ రెడ్డి, ఈశ్వరయ్య, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడిపితోనే మహిళల భవిష్యత్తుకు భరోసా...

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపితోనే మహిళల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ అన్నారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం టిడిపి నాయకులతో కలిసి పట్టణంలోని ఆర్‌టిసి కాలనీ, త్యాగరాజ్ నగర్‌లో మహాశక్తి మ్యానిఫెస్టో ప్రచారాన్ని నిర్వహిస్తు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జేపికే రాము, బిసి రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్, పార్లమెంట్ మహిళా కార్యదర్శి చెన్నమ్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర అంగాన్ వాడి కార్యదర్శి వెంకటలక్ష్మి, గీతమ్మ, గంగమ్మ, వార్డు నాయకులు వెంకట రమణ, అశోక్, కురుబ మల్లికార్జున, రాజశేఖర్, ఈశ్వరమ్మ, శ్రీధర్, అబూబకర్, నెట్టప్ప, ప్రియా గంగాధర్, మంగేశ్, దాదా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ఒలు పనితీరు మెరుగు పర్చుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల్లో విధుల్లో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బిఎల్ఒలు వారి పనితీరును ఇంకా మెరుగు పర్చుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ, మేళాపురం, అబాద్ పేటలలో గల పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటి సర్వేను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సర్వేపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి వారికి ఓటరు కార్డు, ఓటర్ లిస్ట్ పరిశీలించి, కుణ్ణంగా తెలుకొని వారి వివరములు నవీకరించాలని సూచించారు. సూపర్ వైజర్లు వాళ్లకున్న బిఎల్ఒలను. ప్రతి దినం పర్యవేక్షించి వారితో కలసి హౌస్ టూ హౌస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసీనా సుల్తాన, ఆర్ఐ అమరేంద్ర, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

చేనేతలకు తీరని అన్యాయం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వం చేనేతలకు తీరని అన్యాయం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం తన వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా రూ.110 కోట్లు చేనేతల రుణమాఫీ చేశారన్నారు. చంద్రబాబు చేనేతలకు రూ.600 ఇస్తున్న పింఛన్‌పై తాను, నిమ్మలకిష్టప్ప ప్రతిపాదనలు పెట్టగా రూ.600 నుంచి పెంచి రూ.2వేలు చేశారన్నారు. వాటిని ప్రస్తుతం నేతన్ననేస్తం కిందరూ. 24వేలు ఇస్తున్నారని, అది కూడా అర్హులకు ఇవ్వకుండా అనర్హులకే ఇస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా 45 ఏళ్లకే చేనేత పించన్లు ఇస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే గోడలపై రాయించారని, ఆహామీ ఏమైందని గోనుగుంట్ల ప్రశ్నించారు. అదేవిధంగా కార్మికులకు ఉచిత కరెంటు ఇస్తామని ప్రస్తుతం ఉచిత కరెంటు ఇవ్వకపోగా ఇప్పటికి ఐదుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. అదేవిధంగా తొగటవీర కార్పొరేషన్ చైర్మన్ పదవి మహిళకు ఇచ్చారే కానీ కనీసం విజయవాడలో కుర్చీకూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఆ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. అప్పట్లో తాను ఎమ్మెలే ఉన్నప్పుడు పట్టణంలో దాదాపు15 వేలు ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. అదేవిదంగా సొంత స్థలం ఉన్నవారికి కూడా ఇళ్ల నిర్మాణానికి రూ.2.50లక్షలు ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఇంటిస్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టకపోతే వెనక్కి తీసుకుంటున్నామని అధికారులు బెదిరిస్తున్నారన్నారు. కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేని వారికి చెందిన పట్టాలను ఐదారుగు కొనుగోలు చేస్తున్నారని. వాటిని తాము అధికారంలోకి వచ్చాకతిరిగి లబ్ధిదారులకే ఇప్పిస్తామని అన్నారు. అధికార పార్టీ వారికి సహకరించిన అధికారులు ప్రభుత్వం మారితే జైలుకు పోకతప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, రాజు, అరవిందరెడ్డి, బోడగల గిరిధర్, దేవేంద్రరెడ్డి, నారాయణస్వామి, చిలకం సూర్యనారాయణరెడ్డి, తుంపర్తి పరమేశ్, బొల్లినేని శ్రీనివాసులు, అంబటి బద్రీనాథ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : వివిధ కారణాలతో ఆత్మహత్యచేసుకున్న చేనేత కుటుంబాలను జాతీయ ప్రపంచచేనేత దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సోమవారం పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సం దర్భంగా బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి మొత్తం రూ.1,30 లక్షల ఆర్థికసాయం అందజేశారు. శారదానగర్లో రమణారెడ్డి కుటుంబసభ్యులకు రూ.20వేలు, సాకేగంగాధర్ కుటుంబసభ్యులకు రూ.20వేలు, గుడిపాటి ఆనంద్ కుటుంబానికి రూ.10వేలు, శాంతినగర్‌కు చెందిన షాజహాన్ కుటుంబ సభ్యులకు రూ.20వేలు, సంజయ్ నగర్‌కు చెందిన బాలాజీ కుటుంబసభ్యులకు రూ.20వేలు. రామ్‌నగర్‌కు చెందిన చింతాజగదీశ్ కుటుంబసభ్యులకు రూ.20వేలు అందజేశారు. రాంనగర్‌కు చెందిన విజయ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కష్టార్జితాన్ని ఇప్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పరిశ్రమను మూసి వేయడంతో పాటు తమ కష్టార్జితాన్ని ఇవ్వకుండా యాజమాన్యం మోసం చేస్తోందని తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్ అన్నారు. సోమవారం ఈ విషయంపై అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను కార్మికులు కలిసి వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడ లోని గురునానక్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా యాజమాన్యం పరిశ్రమను మూసివేసిందన్నారు.కార్మికులంతా 10 నుంచి 20 సంవత్సరాల పాటు పని చేశారని వారికి (గ్రాట్యుటీ చట్టం 1972) చట్ట ప్రకారం రావాల్సిన గ్రాట్యుటీ ఇప్పించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చాంద్ బాషా, రామచంద్ర, నాగరాజు, సతీష్, ముజీబ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎసిఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : రైలు కిందపడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పరిధిలోని చల్లవారిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చిన్న పడమల గ్రామానికి చెందిన చాపగల రమాదేవి (24) సోమవారం ఇంట్లో నుంచి వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త మంజునాథ తెలిపినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతికి కారణాలు తెలియ రాలేదని, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్ రైల్వే సీఐ తెలిపారు.

బసినేపల్లి వద్ద వ్యక్తి..

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో సోమవారం రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం కమలకుంట్ల గ్రామానికి చెందిన రామ చంద్ర (50) కుటుంబ సమస్యలతో బసినేపల్లి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, హెడ్‌కానిస్టేబుల్ వాసు, తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యవసాయ కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన పలువురు ఆటోలో వ్యవసాయ పనులకు బసినేపల్లి తండాకు బయలుదేరారు. పట్టణంలోని ఆసుపత్రి వద్ద ఆటో వెళుతుండగా వెనకవైపున లారీ ఢీకొంది. దీంతో హాజీవలి, రామతులసి, బిందు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్ బోల్తాలో మరో ఇద్దరు..

మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండ లం పోరుమానుపల్లి చెందిన రామన్న, తిప్పయ్య స్వాములు గుత్తికి రావడానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. బసినేపల్లి గ్రామ సమీపంగా రాగానే కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ ఇరువురిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు.

పేకాటజూదరులు అరెస్టు

యాడికి : మండలంలోని చందన గ్రామ పంచాయతీ పరిధిలోని పొలిమేరలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారిపై సోమవారం దాడి చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.25,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు అగ్రహారంలో సోమవారం ఉదయం వృద్ధురాలు వీలమ్మ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు దొంగలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్ర వాహనంలో వచ్చిన దుండగులు అంగడి నిర్వహిస్తున్న నీలమ్మను సిగరెట్ ఇవ్వాలని అడిగారు. దీంతో ఆమె సిగరెట్ ఇవ్వడానికి వెళ్తుండగా మెడలోని చైన్‌ను లాక్కొని పామిడి వైపు పరారైనట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ దేవా తెలిపారు.

అనంతపురం క్రైం : స్థానిక శ్రీనగర్ కాలనీలో వృద్ధురాలి మెడలోనుంచి చైన్‌ను దుండగులు లాక్కెళ్లారు. 4 వ పట్టణ సీఐ ప్రతాపరెడ్డి తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న ఎస్ఎస్‌బిబీ మాన్షన్‌కు దగ్గరలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కాకర్ల రంగమ్మ అనే మహిళ మెడలో చైన్‌ను లాక్కెళ్లారు. 4 వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని పెన్నానది బ్రిడ్జిపై బైకు అదు పుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొనడంతో సోమవారం ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సజ్జలదిన్నె గ్రామానికి చెందిన షౌకత్‌వలి తన ద్విచక్ర వాహనంపై ఏడాది కుమార్తె మొహతాజ్‌తోపాటు బంధువుల పిల్లలు అబిదా, మస్తాన్‌లి, మహమ్మద్ యూనిస్‌తో కలిసి తాడిపత్రికి వస్తుండగా పెన్నానది బ్రిడ్జిపైకి రాగానే బ్రిడ్జిపై ప్రమాదశాత్తు ఫుట్‌పాత్‌ను ఢీకొని కింద పడ్డాడు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షౌకత్‌వలి, మస్తాన్‌వలి, మహ్మద్ యూనిస్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓటరు జాబితా పరిశీలనను పూర్తి చేయాలి : టిడిపి

ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని కొండకమర్ల, డబుల్‌వారిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ఓటర్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని టిడిపి పార్లమెంట్ రైతు మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ జాకీర్ అహ్మద్, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, పుట్టపర్తి నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గంగాద్రి డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ రామ్‌నాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల నుండి ఓటర్ వెరిఫికేషన్ అన్ని మండలాలలో జరుగుతోందని అయితే కొండకమర్ల, డబుల్‌వారిపల్లి గ్రామపంచాయతీల్లో బిఎల్‌ఒలు ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. సమయం తక్కువగా ఉండడం వల్ల ఈ వెరిఫికేషన్‌ను త్వరతగతిన పూర్తిచేయాలని కోరారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు గుంతలమయం

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి జిల్లా కేంద్రం సమీపంలో గల జగరాజుపల్లి పెనుగొండ ప్రధాన రహదారిలో కియా పరిశ్రమకు వెళ్లే రహదారి గుంతలమయమైంది. చిన్నపాటి వర్షానికి గుంతల మయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విమర్శించారు. ఈ మేరకు సోమవారం జగరాజు పల్లి దగ్గర రోడ్డును పరిశీలించిన ఆయన మాట్లాడుతూపుట్టపర్తి నుండి పెనుగొండ కియాకి వెళ్లే రహదారులు చిన్న పార్టీ వర్షానికి గుంతలమయంగా మారుతున్నాయన్నారు. ప్రధానంగా జగరాజు పల్లి క్రాస్ మలుపులో తారు రోడ్డు పెద్ద గుంతగా మాదిరి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

క్రీడా మైదానం ఆక్రమణపై ధర్నా

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామంలో క్రీడా మైదానాన్ని ఆక్రమించుకున్న కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 188లో 18 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉండేద న్నారు. అయితే ఇందులో కొంత భాగం క్రీడా మైదా నం చేసుకుని యువకులు క్రికెట్ ఆడే వారన్నారు. ఈనేపథ్యంలో ఇటీవల ఆరెకరాల భూమిని కొందరు ఆక్రమించుకున్నారన్నారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని క్రీడా మైదానానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే శ్మశాన వాటిక స్థలం సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఉప తహశీల్దార్ లలితకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రమేష్‌నాయుడు, మాజీ సర్పంచి వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.గూడూరులో పోలీసు ఆంక్షలు

పుట్లూరు : మండలంలోని శనిగల గూడూరులో పోలీసులు 30 యాక్ట్ అమలులో ఉందని ఎస్ఐ దిలిప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ 30 యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఇప్పుడిప్పుడే గ్రామంలో ప్రశాంతత వాతావరణం నెలకొంటున్న నేపథ్యంలో బయటి వ్యక్తులు గ్రామంలోకి రావద్దన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు రావాలంటే తప్పనిసరిగా డీఎస్పీ అనుమతి తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అనంతపురం క్రైం : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేష్‌నాయక్ హెచ్చరించారు. ఈమేరకు సోమవారం స్థానిక సుభాష్ రోడ్డులో అడ్డంగా ఉంచిన ఆటోలు, వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా వాహనాలకు సంబంధించిన లైసెన్సులు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రోడ్డుపై అడ్డంగా పార్కింగ్ చేసిన పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ కి ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలనూ సహించేది లేదన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీసత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 7వ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకం కార్మికుల బకాయి వేతనాలు, బకాయి పడ్డ ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. కలెక్టర్ ఇచ్చిన హామీ కూడా అమలు కాకపోవడం శోచనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, నాగరాజు, శ్రీనివాసులు, మధు, రవి, చారి, లక్ష్మీరెడ్డి, తిరుపాల్‌నాయక్, శ్రీనివాసనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అత్యవసరం

పరిగి : పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అత్యవసరమని ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పరిగి పి హెచ్ సి వైద్యులు డాక్టర్ స్వరూప రెడ్డి కోరారు. సోమవారం పరిగి మండల కేంద్రంలోని సీతారామపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైద్య,అంగన్వాడి సిబ్బంది, పిహెచ్‌సి సిబ్బంది వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తు, ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యలయంలో వివిధ విభాగాలను పరిశీలన చేసి, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది వారి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, ప్రజల సమస్యలను సకాలంలో స్పందించి పరిష్కరించాలని సూచించారు.

మండల సమావేశం బహిష్కరణ

గుత్తి : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.విశాలాక్షి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని టిడిపి ఎంపిటిసిలు, సర్పంచులు బహిష్కరించారు. సమావేశం ప్రారంభంకాగానే టిడిపి సర్పంచి పి.భరత్‌కుమార్, ఎంపిటిసిలు ధనంజయ, జింకా నారాయణస్వామి ప్లకార్డులు పట్టుకుని పోడియం ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డు తగులుతోందన్నారు. ఇప్పటికైనా ఆ నిధులను సర్పంచుల పిఎఫ్ ఎంఎస్ ఖాతాలోకి జమచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిదానాలు చేస్తూ మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు.

10న మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన ఈనెల 10వ తేదీ బుధవా రం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించను న్నట్లు ఎంపిడిఒ దివాకర్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారు లు వారి శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఓటుహక్కుపై అవగాహన

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం నమూనా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించి విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి ఎన్నికల ఆవశ్యకత, ఎలా నిర్వహించా లనే విషయాలను కూలంకుశంగా వివరించారు. అలాగే భవిష్యత్‌లో ఎలా ఓటుహక్కు వినియోగిం చుకోవాలో తెలుసుకోవాలన్నారు. ప్రతి పౌరుడూ హక్కులతోపాటు బాధ్యతలను కూడా తెలుసుకోవా ల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఇందులో భాగంగా విద్యార్థులను నాలుగు భాగాలు గా విభజించి ఎన్నికలు నిర్వహించారు. ఓట్ల లెక్కి ంపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిం చారు. అనంతరం గెలిచిన వారితో ప్రమాణస్వీకా రం చేయించారు. తర్వాత మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణ, వైస్ ప్రిన్సిపల్ షమీనా, డీన్ సత్యనారాయణ, కో డీన్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.